సాక్షి
నాగర్‌కర్నూల్

బుధవారం, 22, మే, 2024



టెర్రర్ హైవేస్

శ్రీశైలం- హైదరాబాద్ జాతీయ రహదారి నిత్యం ప్రమాదాలతో రక్తమోడుతోంది.

వివరాలు 8లో ▸



పులకించిన తుంగాతీరం

ఉత్తరవాహిని తుంగభద్ర నదీతీరం మంగళవారం వేద ఘోషతో పులకించింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
40.4 /23.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వేళలో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గిరిజన గురుకులంలో స్పాట్ అడ్మిషన్స్

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గిరిజన బాలుర గురుకుల జూనియర్ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకిగాను స్పాట్స్ అడ్మిషన్స్ తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ నిమ్మల పద్మావతి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ప్రస్తుతం సీఈసీలో 29, హెచ్ఈసీలో 34 సీట్లు ఖాళీగా ఉన్నాయని.. విద్యార్థులు సాధించిన జీపీఏ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి గ్రూప్‌లో ఇతరులకు 5 సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తిరుమల హిల్స్ గిరిజన గురుకుల ఆర్సీఓ కార్యాలయంలో స్పాట్ అడ్మిషన్స్‌కు సంబంధించి కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు జిరాక్స్ సెట్లు, 6 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

నాగర్‌కర్నూల్ క్రైం: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో 2024–25 విద్యా సంవత్సరం 3, 5, 8 తరగతుల్లో ప్రవేశానికిగాను జిల్లాకు చెందిన గిరిజన బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 10 సీట్లు, 5లో 6 సీట్లు, 8లో 4 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన వారి వార్షిక ఆదాయం రూ. లక్ష 50వేల లోపు, పట్టణ ప్రాంతానికి చెందిన వారి వార్షిక ఆదాయం రూ. 2లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు జూన్ 6వ తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మహిళలు, బాలికలను వేధిస్తే కఠిన చర్యలు



నాగర్‌కర్నూల్ క్రైం: మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఎస్ఆర్ మెమోరియల్ పాఠశాల విద్యార్థులకు షీ టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకొని ముందుకుసాగాలని సూచించారు. మహిళలు, బాలికలతో దురుసుగా ప్రవర్తించినా.. ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేసినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పోలీసు వ్యవస్థ పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోవర్ధన్, షీ టీం ఏఎస్ఐ విజయలక్ష్మి, వెంకటయ్య ఉన్నారు.

మారని తీరు..

జనరల్ ఆస్పత్రిలో అందని స్పెషలిస్ట్ వైద్యసేవలు



జిల్లా జనరల్ ఆస్పత్రి

- ఓపీ సేవల్లోనూ డాక్టర్లు లేక రోగుల అవస్థలు
- డెంటల్, ఈఎన్‌టీ సేవలకు ప్రైవేటు ఆస్పత్రులే దిక్కు
- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ



జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం వచ్చిన రోగులు



మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా తెరచుకోని ఓపీ గది

సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి జనరల్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ.. వసతులు మాత్రం మెరుగుపడటం లేదు. ఆస్పత్రిలోని కొందరు వైద్యుల తీరు విమర్శలకు దారితీస్తోంది. కొన్ని స్పెషలిస్టు విభాగాల్లో డాక్టర్లు ఓపీ సమయాల్లోనూ రోగులకు అందుబాటులో ఉండటం లేదు. ఉదయం 11 గంటల తర్వాత ఆలస్యంగా విధులకు హాజరవుతూ.. మధ్యాహ్నం 12:30 గంటలకే తిరుగుప్రయాణం అవుతుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్నిసార్లు స్పెషలిస్టు విభాగాల డాక్టర్లు అసలు అందుబాటులో ఉండని పరిస్థితి నెలకొంది. జనరల్ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలుపరుస్తున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం వైద్యులు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు.

ఎక్స్‌రే ఫిల్మ్‌లకూ కొరతే..

జనరల్ ఆస్పత్రిలో రక్త పరీక్షలు, ఎక్స్‌రే, సిటీ స్కాన్ సేవలకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. రక్త పరీక్షల కోసం వచ్చే రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. వాటి రిపోర్టులు మరుసటి రోజున తీసుకోవాలని సిబ్బంది చెబుతున్నారు. ఎక్స్‌రే విభాగంలో రోగులకు ఫిల్మ్‌లను ఇవ్వడం లేదు. ఎక్స్‌రే ఫిల్మ్‌లు అందుబాటులో లేవని.. నేరుగా సంబంధిత డాక్టరు వాట్సప్ నంబర్‌కే పంపుతామని చెబుతుండటం గమనార్హం. జనరల్ ఆస్పత్రి ప్రాంగణంతో పాటు వార్డులు, టాయిలెట్లతో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైందని రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో పారిశుద్ధ్యం, వైద్యులు, సిబ్బంది పనితీరుపై దృష్టిపెట్టాలని కోరుతున్నారు.

డాక్టరు రాలేదని అంటున్నరు..



నాకు మూడు రోజుల నుంచి పన్ను నొప్పి ఎక్కువ అయ్యిందని దవాఖానకు వస్తే, ఇక్కడ డాక్టరు రాలేదని చెబుతున్నారు. రెండు గంటల నుంచి ఇక్కడే ఎదురుచూస్తున్నాను. 12 గంటలు కావస్తున్నా ఇప్పటి వరకు డాక్టరు రాలేదు. మరో రోజున రావాలని చెబుతున్నారు. దూరం నుంచి వచ్చిన. డాక్టరు లేక మందులు లేకుండానే ఇంటికి పోతున్నాను.

– మల్లమ్మ, గోవిందాయిపల్లి, తాడూరు మండలం

నిరంతరం పర్యవేక్షణ..

జనరల్ ఆస్పత్రిలో ఇప్పటికే బయోమెట్రిక్ విధానాన్ని పకడ్బందీగా అమలుచేస్తున్నాం. వైద్యుల పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. డాక్టర్లు ఎవరైనా ఓపీ సమయాల్లో అందుబాటులో లేకపోతే చర్యలు తీసుకుంటాం. రోగులకు ఇబ్బందులు లేకుండా సకాలంలో సేవలు అందేలా చూస్తున్నాం.

– డా.రఘు, సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆస్పత్రి

నామమాత్రంగా బయోమెట్రిక్..

జిల్లా జనరల్ ఆస్పత్రితో పాటు ఇతర ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యుల్లో చాలా మంది ప్రైవేటులోనూ వైద్యసేవలు అందిస్తున్నారు. వీరిలో కొంతమంది ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉదయం వేళల్లో ఓపీ సేవలకు ఆలస్యంగా వస్తూ.. మధ్యాహ్నం త్వరగా వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. జనరల్ ఆస్పత్రిలో బయోమెట్రిక్ అమలు చేస్తున్నప్పటికీ.. గైర్హాజరవుతున్న వారిపై చర్యలు లేకపోవడంతోనే ఈ దుస్థితి తలెత్తుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తెరచుకోని స్పెషలిస్టు ఓపీ గదులు..

జనరల్ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ, సాధారణ మెడికల్ ఓపీ విభాగాల్లో సేవలు సక్రమంగా అందుతున్నా.. వివిధ స్పెషాలిటీ విభాగాలకు సంబంధించిన ఓపీ సేవలు అందించేందుకు కొందరు డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదు. సాధారణ ఓపీ, ప్రసూతి సేవలకు సంబంధించి వైద్యుల కొరత నెలకొనడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే ఆస్పత్రిలో డెంటల్, ఈఎన్‌టీ, మెంటల్ హెల్త్ తదితర విభాగాల్లో వైద్యులు సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

■ జనరల్ ఆస్పత్రిలో ఓపీ సేవలకు ఆధార్‌ను తప్పనిసరి చేశారు. దీంతో సర్వర్ సమస్యల కారణంగా ఓపీ వద్ద రిజిస్ట్రేషన్ ఆలస్యం అవుతుండటంతో రోగులు గంటకు పైగా క్యూలో నిరీక్షించాల్సి వస్తోంది. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు ఓపీ స్లిప్ తీసుకున్న తర్వాత డాక్టర్లు అందుబాటులో లేకుండా పోతుండటంతో నిరాశకు గురవుతున్నారు. సంబంధిత విభాగంలో వైద్యుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈక్రమంలో రోగులను ఎమర్జెన్సీ విభాగంలో సంప్రదించాలని ఆస్పత్రి సిబ్బంది సూచిస్తున్నారు. తీరా ఎమర్జెన్సీ విభాగంలోకి వెళ్లాక, వారిని మళ్లీ సంబంధిత విభాగంలోనే డాక్టర్లను కలవాలని సూచిస్తున్నారు. సంబంధిత డాక్టరు అందుబాటులో లేడంటే, మరుసటి రోజు రావాలని ఉచిత సలహా ఇస్తున్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

- మామిడి రైతులు అత్యాధునిక పద్ధతులు పాటించాలి
- కలెక్టర్ ఉదయ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్: ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని.. జిల్లాలోని రైతులు అత్యాధునిక సాగు పద్ధతులు పాటించి, అధిక లాభాలు పొందాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు, ఎగుమతులు, లాభాలపై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కొల్లాపూర్ మామిడికి దేశ దేశాల్లో మంచి గుర్తింపు ఉందని.. అందుకు అనుగుణంగా రైతులు మరింత నాణ్యమైన మామిడి ఉత్పత్తులు చేయాలని సూచించారు. జిల్లాలో 14,419 మంది రైతులు 33,523 ఎకరాలలో మామిడి తోటలను సాగుచేస్తున్నారని చెప్పారు. రైతులు పంటల సాగుతో పాటు మార్కెట్ మెళకువలను పాటించడం అతి ముఖ్యమని తెలిపారు. స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో రైతుల నుంచి సేకరించిన మామిడి కాయలను వివిధ దేశాలకు ఎగుమతులు చేస్తూ, లాభదాయకమైన మార్కెట్లను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ ప్రాంతం అన్ని పంటల సాగుకు అనుకూలమని.. రైతులు ఉద్యాన సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో ఉద్యాన పంటలపై అధికారులు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం సదస్సును విజయవంతంగా నిర్వహించిన అధికారులను కలెక్టర్ శాలువాతో సత్కరించి, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.ప్రేంసింగ్, నాబార్డు ఏజీఎం ఆర్పీ నాయుడు, జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ అధికారి బి.చక్రపాణి, వివిధ జిల్లాల అధికారులు సురేష్, కమల, మహేష్, నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి, డీఆర్డీఓ చిన్న ఓబులేష్, ఎల్డీఎం కౌశల్ కిషోర్ పాండే, కేవీకే పాలెం ఉద్యాన శాస్త్రవేత్త ఆదిశంకర్, ఉద్యానశాఖ కొల్లాపూర్ అధికారి ఎం.లక్ష్మణ్, కల్వకుర్తి అధికారి ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నాబార్డు డీడీఎం

కలెక్టర్ ఉదయ్‌కుమార్‌ను మంగళవారం నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నాబార్డు తరఫున గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ అభివృద్ధికి అధిక మొత్తంలో రుణాలు అందేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సీతారామారావు

నాగర్‌కర్నూల్: ఈనెల 24నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ సీతారామారావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు రెండు సెషన్లలో ఉంటాయని తెలిపారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి సెషన్.. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటలకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రశ్నపత్రాలను ఆయా రూట్‌ల వారీగా పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్లాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు తగిన పోలీసు బందోబస్తు ఉండేలా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. వేసవి దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రంలో తప్పనిసరిగా మంచినీటి వసతి కల్పించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, తగినంత గాలి, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలన్నారు. విద్యార్థులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. మొదటి సంవత్సరం 4,037 మంది, ద్వితీయ సంవత్సరం 2,511 మందితో కలిపి మొత్తం 6,548, మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 21 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ అధికారిని నియమించినట్లు తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

భక్తిభావంతో మెలగాలి



రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తిరూరల్: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని మార్చాలలో మంగళవారం నిర్వహించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డిని ఉత్సవాల నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఆనంద్‌కుమార్, రాములు, జంగయ్యగౌడ్ పాల్గొన్నారు.

24న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈ నెల 24న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తునట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు మొత్తం 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 11 గంటలకు పరీక్ష జరుగుతుందని విద్యార్థులను 9.30 గంటలకు పరీక్ష కేంద్రంలోనికి వదులుతామన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్ బ్లాక్‌పెన్సిల్, ఎరేజర్, బ్లాక్‌పెన్నును వెంట తీసుకురావాలనాన్నారు. హాల్‌టికెట్లు ఆన్‌ఆలైన్‌లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

సోనామసూరి ధర రూ.2,419

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం గరిష్టంగా రూ.2,419, కనిష్టంగా రూ.2,143 ధరలు నమోదయ్యాయి. ఆముదాలు క్వింటాల్‌కు సరాసరిగా రూ.5,479 ధర పలికింది. మార్కెట్‌కు 300 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం



తెలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర ఏఎస్ఓల బృందం

తాడూరు/తెలకపల్లి/బిజినేపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం కేంద్ర ఏఎస్ఓల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. తాడూరు మండలం అల్లాపూర్ గ్రామంలో అధికారులు ఆదిత్య స్వరూప్, ప్రమీజ్‌కుమార్ వర్మ, అజిత్‌కుమార్, దీపక్ ఉజ్వల్ పర్యటించారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రత, వైకుంఠధామం నిర్వహణ, డంపింగ్‌యార్డు ఉపయోగం, పల్లెప్రకృతి వనాల నిర్వహణ వివరాలను ఎంపీడీఓ జ్యోతి పరోసియా, పంచాయతీ కార్యదర్శి వినోద్‌కుమార్‌తో తెలుసుకున్నారు. రైతు వేదికల వినియోగం, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు.

■ తెలకపల్లిలోని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, విద్యాలయాలను కేంద్ర ఏఎస్ఓల బృందం పరిశీలించింది. ఈసందర్భంగా అధికారులతో సమావేశమై పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. నిధులు, ఆదాయం, వ్యయాలు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈనెల 24వ తేదీ వరకు ఆయా శాఖల సమాచారాన్ని కేంద్ర బృందం సేకరిస్తుందని ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు.

■ బిజినేపల్లిలోని తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలను కేంద్ర ఏఎస్ఓల బృందం దీక్షాంత్, రవీందర్, కావ్యాన్సు సోని, దర్పన్, సత్యేంద్ర పరిశీలించి, పనితీరును తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, మహిళా సమాఖ్యల పనితీరుపై ఆరా తీశారు. వారి వెంట ఎంపీడీఓ కథలప్ప ఉన్నారు.

పీయూ ఇన్‌చార్జ్ వీసీగా అహ్మద్ నదీమ్



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నూతన ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్‌గా 1997 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన అహ్మద్ నదీమ్‌ను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్నారు. ఆయనకు జూన్ 15 వరకు లేదా రెగ్యులర్ వీసీ నియామకం అయ్యే వరకు కొనసాగనున్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయాలి



మాట్లాడుతున్న సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్

కల్వకుర్తి టౌన్: సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బులు పోగొట్టుకున్న బాధితులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో సైబర్ క్రైమ్ బాధితులు, పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు సైబర్ క్రైమ్ పోలీసులు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. పోలీసులు లేదా డయల్ 1930 నంబర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుల డబ్బులు సైబర్ నేరగాళ్లకు చేరకుండా ఫ్రీజ్ చేశామని చెప్పారు. వాటిని కోర్టు ద్వారా బాధితులకు తిరిగి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జూన్ 8వ తేదీన నిర్వహించే మెగా లోక్‌అదాలత్‌లో బాధితుల డబ్బులను కోర్టు ద్వారా అందిస్తామని సూచించారు. డివిజన్‌లోని ఆయా పోలీస్‌స్టేషన్లలో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా బాధితులకు ఎస్ఐలు, కోర్టు డ్యూటీ కానిస్టేబుళ్ల సహాయం అందిస్తారని తెలిపారు. సమావేశంలో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐలు వీరబాబు, రాజశేఖర్, మాధవరెడ్డి, రవి, మహేందర్ తదితరులు ఉన్నారు.

నేటినుంచి మన్యంకొండ నరసింహుడి ఉత్సవాలు



మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం మొదటి రోజు శుద్ధి పుణ్యాహవచనం, రాత్రికి హనుమత్ వాహన సేవ నిర్వహిస్తారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, రాత్రికి గరుడ వాహన సేవ, శుక్రవారం ఉదయం వసంతోత్సవం, అవభృత స్నానం కార్యక్రమాలు ఉంటాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, తాగునీటి వసతి, స్వామివారి కల్యాణంలో పాల్గొనే భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో మన్యంకొండ సమీపంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు హాజరై స్వామివారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

క్లుప్తంగా

24న పాలెంలో విత్తన మేళా

బిజినేపల్లి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో మే 24వ తేదిన విత్తనమేళా నిర్వహించనున్నట్లు ఏడీఆర్ మల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే మేళాలో వరి, వేరుశనగ, తెల్లజొన్న, పచ్చజొన్న, కంది, మినుము, పెసర, ఆముదం, రాగులు, ఉలవలు, సజ్జ, కొర్రలు వంటి పలు రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విత్తనాల సమాచారం కోసం 9490409163, 6300820238 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ ల్యాబ్ టెక్నీషియన్ మృతి



గోపాల్(ఫైల్)

మరికల్: గ్యాస్ సోడ దుకాణం వద్ద సిలిండర్ పేలిన ఘటనలో ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ 20 రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలం కోటకొండ పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న గోపాల్(57) ఈ నెల 1న మరికల్ చౌరస్తాలో మహబూబ్‌నగర్‌కు వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న గ్యాస్ సోడ సిలిండర్ పేలి ఆ వ్యక్తిపై పడింది. తీవ్ర గాయలైన ఆయన్ను వెంటనే జిల్లా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ 20 రోజుల పాటు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ మురళి తెలియజేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మనస్తాపంతో వృద్ధుడి బలవన్మరణం

ఉప్పునుంతల: మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం గంధం చంద్రయ్య (75) అనే వృద్ధుడు ఇంటిముందు వేపచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఇతర పనులపై గ్రామంలోనే బయటకు వెళ్లగా ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న చంద్రయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా చెట్టుకు ఉరేసుకొని వేలాడుతుండగా కొంతసేపటికి పక్క ఇంటి గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అందరూ వచ్చి చూశారు. కాగా అప్పటికే ఆయన మరణించాడు. చంద్రయ్య భార్య వెంకటమ్మ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురైన అతడు మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

యువతి మృతిపై డీఎస్పీ విచారణ

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాధిక ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. యువతి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ఇదిలా ఉండగా రాధిక మరణానికి కారణమైన నిందితుడు రాకేష్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జేఎం మిషేక్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు.

కారు, ఆటో ఢీ : 12 మందికి గాయాలు

వెల్దండ: మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్స్ సమీపంలో మంగళవారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ఘటనలో 12 మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. చారకొండ మండలం తూర్పుతండాకు చెందిన గిరిజన రైతులు పత్తి విత్తనాల కొనుగోలుకుగాను ఆటోలో భూత్పూర్‌కు వెళ్లారు. పని ముగించుకొని రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళ్తూ వెల్దండలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కల్వకుర్తి వైపు వెళ్తున్న కారు ఆటోని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో ఉన్న నేనావత్ భాస్కర్, కొర్ర లక్ష్మణ్, గోపాల్, బాల్యా, సీతారాం, అంజి, గోపాల్, లింగమయ్యకు తీవ్ర గాయాలుకాగా.. మరో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. అదేవిధంగా కారులో ఉన్న వారికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

టెర్రర్ హైవేస్!



ప్రమాదాలకు నిలయంగా మారిన తాండ్ర స్టేజీ ఇదే

- ప్రమాదాలకు అడ్డాగా మారిన తాండ్ర, కొండారెడ్డిపల్లి స్టేజీలు
- 3 కి.మీ. మేర 765, 167 జాతీయ రహదారులు
- వాహనాల రద్దీ.. మితిమీరిన వేగంతో ప్రమాదాలు
- రోడ్డు దాటేందుకు జంకుతున్న వాహనదారులు, పాదచారులు

కల్వకుర్తి: ఆ స్టేజీ యమ డేంజర్.. అక్కడ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సిందే. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం బారిన పడినట్లే. ఆ స్టేజీ తాండ్ర. కల్వకుర్తి పట్టణానికి 7 కిలోమీటర్ల దూరంలో శ్రీశైలం– హైదరాబాద్, దేవరకొండ–జడ్చర్ల జాతీయ రహదారులపై తాండ్ర గ్రామ స్టేజీ ఉంటుంది. ఈ స్టేజీకి అర కిలోమీటర్ దూరంలో సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లి స్టేజీ కూడా ఉంది. అక్కడ కూడా ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి.

రోడ్డు దాటే క్రమంలో..

765, 167 నంబర్ల జాతీయ రహదారులపైనే తాండ్ర, కొండారెడ్డిపల్లి స్టేజీలు ఉన్నాయి. జేపీ నగర్ తండా నుంచి శ్రీశైలం (వంగూరు) టరి ్నంగ్ రోడ్డు వరకు దాదాపు 3 కి.మీ. మేర రెండు జాతీయ రహదారులు కలిసి ఉంటాయి. ఈస్టేజీల మీదుగా వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. దీంతో వాహనదారులు, పాదచారులు రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. కాగా, ప్రమాదాలు అధికంగా జరిగే 3 కి.మీ. జాతీయ రహదారులను నాలుగు లెన్లుగా మారిస్తే బాగుంటుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో పాటు అండర్ పాస్ నిర్మించి, ఇరువైపులా సర్వీస్‌రోడ్లు నిర్మించడం వల్ల ప్రమాదాలకు అడ్డుకట్ట వేయవచ్చని చెబుతున్నారు.

ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలి..



తాండ్ర స్టేజీ అంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. స్టేజీ వద్ద రోడ్డు విస్తరించడంతో పాటు అండర్ పాస్ నిర్మించి ప్రమాదాలను అరికట్టాలి.

– అశోక్, తాండ్ర

తాత్కాలిక చర్యలు చేపడతాం..

తాండ్ర, కొండారెడ్డిపల్లి స్టేజీల వద్ద ప్రమాదాల నివారణకు ప్రస్తుతం తాత్కాలిక చర్యలు చేపడుతాం. రోడ్డుపై బ్లింక్ సిగ్నల్స్, వైట్ లైన్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. వారం రోజుల్లో ఏర్పాటు చేస్తాం. ఇరువైపులా రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలు తొలగిస్తాం. బారికేడ్లు ఏర్పాటుచేసి వాహనాల వేగాన్ని నియంత్రిస్తాం. తాండ్ర స్టేజీ వద్ద రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 100 అడుగుల మేర రహదారిని అభివృద్ధిపర్చాలి. అండర్ పాస్ నిర్మాణం కూడా చాలా అవసరం. త్వరలో నాలుగు లెన్ల కోసం డీపీఆర్ పూర్తిచేస్తున్న క్రమంలో ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటాం.

– గంగాధర్, జాతీయ రహదారుల కన్సల్టెంట్

నెలరోజుల వ్యవధిలోనే ముగ్గురు మృతి..

తాండ్ర స్టేజీ నుంచి పోతేపల్లి, గిరిజన తండాలు, గోకారం, చంద్రాయినిపల్లి, లింగారెడ్డిపల్లి, దొడ్లపల్లి, జేపల్లి తదితర గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి కల్వకుర్తికి రావాలంటే తాండ్ర స్టేజీ వద్ద రోడ్డు దాటాల్సిందే. ఈక్రమంలోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నెల రోజుల వ్యవధిలోనే ముగ్గురు చనిపోగా.. అనేక మంది క్షతగాత్రులుగా మారారు. శ్రీశైలం వైపు వాహనాలు వేగంగా వెళ్తుండటం.. రోడ్డుపక్కన వాహనాలను నిలపడం.. స్టేజీ వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది.

పులకించిన తుంగా తీరం



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు, పాలకవర్గ సభ్యులు

జోగుళాంబ శక్తిపీఠం: ఉత్తర వాహిణి తుంగభద్ర నదీతీరం మంగళవారం వేద ఘోషతో పులకరించింది. నారసింహ జయంతి సందర్భంగా తుంగభద్ర నదీతీరాన వెలిసిన యోగ నారసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు.. అదేవిధంగా జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో శ్రీశైల దేవస్థానం వారు శ్రీగిరి ప్రదక్షిణలు నిర్వహించారు. ముందుగా వీరు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్యతో కలిసి ఆలయం చుట్టూ ప్రాకార మండప ప్రదక్షిణలు.. అనంతరం గణపతి దగ్గర పూజలు నిర్వహించి వేదపండితులు మహాన్యాస పారాయణం పఠించారు. అలాగే బాలబ్రహ్మేశ్వరుడికి నమక, చమకాలతో ఏకాదశ రుద్రా భిషేకం నిర్వహించారు. జోగుళాంబ అమ్మవారికి శ్రీసూక్త విధానంలో పూజలు, ఖడ్గమాల అర్చనలు చేశారు. ఆలయ ఈఓ, చైర్మన్, ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు వెంకటనారాయణరెడ్డిని శ్రీశైల దేవస్థానం సిబ్బంది శేషవస్త్రాలతో సత్కరించారు. ఏటా వైశాఖ మాసంలో శ్రీశైల మహాక్షేత్రానికి నలుదిక్కుల ఉన్న క్షేత్రాల్లో శ్రీగిరి ప్రదక్షిణలు నిర్వహించడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయమన్నారు. కార్యక్రమంలో శ్రీగి రి ప్రదక్షిణ ఇన్‌చార్జ్ సాయికుమార్, వేదపండితులు పృథ్వి, సుబ్రహ్మణ్యం, అర్చకులు రాజేష్, కిషోర్, ప్రసన్న, బసవ, పరిచారకుడు శివయ్య ఉన్నారు.



యోగా నారసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఉదయాస్తమ సేవలు..

తుంగభద్ర నదీతీరాన వెలిసిన యోగా నారసింహస్వామి ఆలయంలో ప్రాతః కాలం పంచామృత అభిషేకం, అలంకరణ, పురుష సూక్త విధానంగా పూజలు నిర్వహించారు. అలాగే ప్రదోశ కాలలో ఆలయ ముఖ మండపంలో ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. అంతకుముందు ఆలయ చైర్మన్ ఆధ్వర్యంలో భజనలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై పూజ కార్యక్రమాలు తిలకించారు. అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

ఇంటి అనుమతులు ఇవ్వాలని వృద్ధురాలు వేడుకోలు



పంచాయతీ కార్యాలయం నుంచి వృద్ధురాలిని, పెట్రోల్ బాటిల్‌ను తీసుకెళ్తున్న పోలీస్

పెట్రోల్ బాటిల్‌తో పంచాయతీ కార్యాలయానికి వచ్చిన వైనం

మద్దూరు: ఇంటి అనుమతులు ఇవ్వాలని కోరుతూ ఓ వృద్ధురాలు పెట్రోల్ బాటిల్‌తో పంచాయతీ కార్యాలయానికి వెళ్లిన సంఘటన మండలంలోని నాగిరెడ్డిపల్లిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన నడిమింటి పద్మమ్మకు చెందిన ఇంటిని అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు గౌడ్‌కు విక్రయించింది. ఈ క్రమంలో ఆంజనేయులుగౌడ్ పాత ఇంటిని కూల్చి కొత్త ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. పద్మమ్మ పెద్దకుమారుడు రాములుగౌడ్ నాకు తెలియకుండా మా అమ్మ ఇంటిని ఎలా అమ్ముతుందని కోర్టుకు వెళ్లాడు. ఈ క్రమంలో పంచాయతీ కార్యదర్శి అనుమతులు ఇవ్వకుండా ఉంచాడు. ఇంటిని కొనుగోలు చేసిన ఆంజనేయులుగౌడ్ పద్మమ్మపై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో ఆమె పెట్రోల్ తీసుకొని పంచాయతీ కార్యాలయానికి వెళ్లింది. అనుమతి ఇవ్వకుంటే పెట్రోల్ పోసుకొని చనిపోతానని బెదిరించింది. దీంతో పంచాయతీ కార్యదర్శి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడకు చేరుకుని వృద్ధురాలికి నచ్చజెప్పి తీసుకెళ్లారు. ఈ స్థలం కోర్టులో వివాదం ఉండటంతో అనుమతి ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శి సత్తయ్య వివరించారు.

నల్లమలలో శాకాహార జంతువుల సర్వే



సర్వే సిబ్బందికి ఫర్హాబాద్ సమీప అటవీ ప్రాంతంలో కనిపించిన చుక్కల దుప్పులు

మన్ననూర్: నేషనల్ టైగర్ కన్జర్వేషన్ ఆఫ్ అథారిటీ న్యూఢిల్లీ (ఎన్‌టీసీఏ) వారి ఆదేశాల మేరకు అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలోని నల్లమల ప్రాంతం అమ్రాబాద్, మద్దిమడుగు, మన్ననూర్, దోమలపెంట రేంజ్‌ల పరిధిలో శాకాహార జంతువుల ట్రాన్సెక్ట్ లైన్ సర్వే నిర్వహిస్తున్నారు. మంగళ, బుధ, గురువారాలు మూడు రోజుల పాటు సర్వే కొనసాగుతుందని ఎఫ్ఆర్‌ఓ ఈశ్వర్ తెలిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వులో (ఏటీఆర్) అమ్రాబాద్, అచ్చంపేట, నాగార్జునసాగర్ మూడు డివిజన్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే అచ్చంపేట, నాగార్జునసాగర్ డివిజన్లలో సర్వేలు పూర్తయ్యాయి. మంగళవారం మొదటి రోజు అమ్రాబాద్ డివిజన్‌లో ప్రధానంగా జాతీయ జంతువు పెద్దపులి, చిరుతల వంటి మాంసాహార జంతువులకు ఆహారంగా శాకాహార జంతువులు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏ మేరకు ఎక్కడెక్కడ ఉన్నాయని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అమ్రాబాద్ డివిజన్ 20,611 స్క్వేర్ కిలోమీటర్ల విస్తీర్ణంలో 140 బిట్లుగా ఏర్పాటు చేశారు. ఈ అటవీ పరిసర ప్రాంతంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాన్సెక్ట్ లైన్ సర్వే కొనసాగుతుందన్నారు. మొబైల్ డేటా, ఫొటో షూట్ ద్వారా శాకాహార జంతువులు సాంబర్, జింక, చుక్కల దుప్పి, అడవి పందులు తదితర వాటిని గుర్తిస్తామన్నారు. ఈ సర్వే కోసం అటవీ శాఖకు చెందిన 60 మంది సిబ్బందికి ఇది వరకే శిక్షణ ఇచ్చామన్నారు.

పేకాట స్థావరంపై దాడులు

మహబూబ్‌నగర్ క్రైం: మామిడితోటలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం రూరల్ పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ గాంధీనాయక్ వివరాలు వెల్లడించారు. ధర్మపూర్ శివారులోని తోళ్లబండ గుట్ట సమీపంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ఘటనా స్థలంలో దాడులు చేశారు. ఈ క్రమంలో మాచన్‌పల్లితండాకు చెందిన భద్రునాయక్‌కు చెందిన మామిడి తోటలో మూడు ముక్కలాట ఆడుతున్నారని.. అదుపులోకి తీసుకోవడానికి వెళ్లిన క్రమంలో కొందరు పరారయ్యారని, కొందరిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.34,220, 8 బైక్‌లు, 3 ఆటోలు, ఒక జీపు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ గాంధీనాయక్

సత్యం ఆధ్వర్యంలో ఈ పేకాట నిర్వహిస్తున్నారని అదుపులోకి తీసుకున్న వారిలో ఎండీ మోయిష్, జావిద్‌ఖాన్, గంజి సురేష్, యాదయ్య, యాదగిరి, మహేష్, ఆంజనేయులు, హన్మంతు, హరికిషన్, శ్రావణ్, నవీన్‌పై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. దాడుల్లో ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులు రిమాండ్‌కు..



పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ వేణు, సిబ్బంది

పాన్‌గల్: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సామగ్రి చోరీచేసిన నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వేణు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలు వెల్లడించారు. గత నెల 28వ తేదీ అర్ధరాత్రి సబ్‌స్టేషన్‌లో పెబ్బేర్‌కు చెందిన 8 మంది సామగ్రిని ఎత్తుకెళ్లారు. సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానితులుగా ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వీరితోపాటు మరో ఆరుగురు ఉన్నట్లు గుర్తించి ఐదుగురిని అదుపులోకి తీసుకొని చోరీ సమయంలో వినియోగించిన రెండు ఆటోలు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అదేవిధంగా ఎత్తుకెళ్లిన సామగ్రిని రికవరీ చేశామన్నారు. చోరీకి పాల్పడిన వారిలో డక్కలి పెద్ద లింగన్న, డక్కలి ఉపేంద్ర, డక్కలి కార్తీక్, కర్నె విశాక్, కర్నె అంజన్న, డాకూరి శ్రీను అలియాస్ సురేందర్, మహంకాళి కిశోర్‌ను రిమాండ్‌కు తరలించగా ఒకరు పరారీలో ఉన్నారన్నారు. కేసును ఛేదించిన తనతో పాటు సిబ్బంది రాంగోపాల్‌వర్మ, హజీబాబా, అంజి, టెక్ టీం మురళిని సీఐ నాగభూషణ్‌రావు అభినందించినట్లు పేర్కొన్నారు.

కడుపులో కణితి తొలగింపు



అచ్చంపేట రూరల్: కొత్తపల్లికి చెందిన నేనావత్ రాంలాల్ కడుపులో కణితి ఉందని తేలడంతో విషయాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకొచ్చారు. కాగా వైద్యుడైన ఎమ్మెల్యే మంగళవారం అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలో శస్త్రచికిత్స కోసం ఏర్పాట్లు చేయాలని అక్కడి వైద్యులకు సూచించారు. వారి సాయంతో స్వయంగా శస్త్రచికిత్స చేశారు. కాగా ఎమ్మెల్యే ప్రభుత్వాస్పత్రిలో ఇప్పటికే ఎనిమిది శస్త్రచికిత్సలు చేయడం గమనార్హం.

బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం ఆలయంలో పంచామృత అభిషేకం, వాస్తు పూజ, హోమం, అగ్ని ప్రతిష్ట, ధ్వజారోహణం, బలిహరణం, పల్లకీసేవ తదితర పూజలు, రాత్రి తెప్ప తేరు కార్యక్రమం అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ రామన్‌గౌడ్, పాలక మండలి సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ టికెట్లతో మోసపోయిన న్యాయవాదులు

- ఉమ్మడి జిల్లా నుంచి చార్‌దామ్ బయల్దేరిన 11 మంది
- పాట్నా నుంచి కేదార్‌నాథ్‌కు రూ.5,500తో ఆన్‌లైన్‌లో టికెట్ల బుకింగ్
- హెలీప్యాడ్ చేరుకున్న తర్వాత ఫేక్ టికెట్లు అని చెప్పిన సంస్థ



చార్‌దామ్ యాత్రకు వెళ్లిన ఉమ్మడి జిల్లా న్యాయవాదులు

అలంపూర్: ఉత్తరఖండ్‌లోని చార్‌దామ్ యాత్రకు వెళ్లిన న్యాయవాదులు ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోగా మోసపోయినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని శాంతినగర్‌కు చెందిన గవ్వల శ్రీనివాసులు, అలంపూర్‌కు చెందిన నాగరాజు యాదవ్, మహబూబ్‌నగర్‌కు చెందిన ఏగేశ్వర రాజు, శివకుమార్, రాజశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హైదరాబాద్‌కు చెందిన గిరివర్ధన్‌రెడ్డి ఈ నెల 15న చార్‌దామ్ యాత్ర నిమిత్తం పాట్నాకు వెళ్లారు. అక్కడి నుంచి కేదార్‌నాథ్ హెలీక్యాప్టర్‌లో వెళ్లడానికి అక్కడ ఉన్న పవన్ హ్యాండ్స్ అనే సంస్థలో ఆన్‌లైన్‌లో ఒక్కొక్కరికి రూ.5,500 చెల్లించి టికెట్లు బుక్ చేసుకున్నారు. గంగోత్రి దర్శనం చేసుకున్న అనంతరం పుట్టకాశీ నుంచి పాట్నాలోని ఏవియేషన్ సర్వీసెస్ వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న టికెట్లు చూపించగా.. తమ సంస్థకు చెందినవి కావని, ఫేక్ టికెట్లు అని చెప్పారు. అయితే వీరితోపాటు తెలంగాణ, ఏపీలోని తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది వరకు ఇలాగే ఆన్‌లైన్‌లో కేదార్‌నాథ్ ఆలయానికి వెళ్లడానికి టికెట్లు బుక్ చేసుకొని మోసపోయారని న్యాయవాది గవ్వల శ్రీనివాసులు తెలిపారు. ఇక్కడ సెప్టెంబర్ వరకు దర్శనానికి అవకాశం లేదని చెబుతున్నారని.. కానీ సదరు వెబ్‌సైట్‌లో ఇప్పటికీ టికెట్లు బుక్ చేసుకునే అవకాశం ఉందని వాపోయారు. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఇలాంటి మోసాలపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యుత్ వైర్లు తగిలి నాలుగు గేదెలు మృతి

- ఈదురు గాలులు, వర్షానికి నేలకొరిగిన స్తంభం
- మహబూబ్‌నగర్ జిల్లా శిఖర్‌గానిపల్లిలో ఘటన



శిఖర్‌గానిపల్లిలో మృతిచెందిన గేదెలు

జడ్చర్ల టౌన్: నేలకొరిగిన విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో నాలుగు గేదెలు మృతిచెందాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని శిఖర్‌గానిపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. సోమవారం సాయంత్రం, రాత్రి సమయంలో కురిసిన వర్షం, ఈదురుగాలులకు గ్రామ శివారులో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి తీగలు వేలాడుతున్నాయి. ఈ క్రమంలో గ్రామంలోని మండ్ల మధుకు చెందిన నాలుగు గేదెలను కుటుంబ సభ్యులు మంగళవారం మేతకు వదిలారు. మేసుకుంటూ వెళ్లిన గేదెలు పొలంలో తెగిన పడిన విద్యుత్ వైర్లకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాయి. మృతిచెందిన గేదెల విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని బాధితులు వాపోయారు. వ్యవసాయంతోపాటు పాడి ద్వారా జీవనం సాగిస్తున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సంఘటన స్థలాన్ని పశువైద్యాధికారి సందర్శించి పంచనామా నిర్వహించారు. అయితే విద్యుత్ స్తంభం బాగోలేదని.. ఫొటోలు తీసి వాట్సాప్ ద్వారా లైన్‌మెన్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధిత రైతు ఆరోపించారు. ఈ విషయమై జడ్చర్ల సబ్‌డివిజన్ ఏడీఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా విచారిస్తామని బదులిచ్చారు.

అచ్చంపేట శివారులో..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని చౌటపల్లి రోడ్డులో విద్యుత్ స్తంభానికి తాకి ఓ గేదె మృతిచెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గోకుల్‌నగర్‌కు చెందిన అంజనమ్మ గేదెలను వ్యవసాయ పొలానికి తీసుకెళ్తుండగా.. కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఓ గేదె తాకడంతో షాక్‌కు గురై మృతిచెందింది. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలికి చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వం కులగణన జరిపిన తర్వాతే త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి.. ఇప్పుడు కులగణన ఊసే ఎత్తకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని చూడటం అన్యాయమన్నారు. రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా ఉన్న బీసీలకు సామాజిక న్యాయం చేస్తామని ప్రకటించి, కర్ణాటక ముఖ్యమంత్రి బీసీ సిద్ధరామయ్యతో తెలంగాణ గడ్డమీద ప్రకటన చేయించి తమ ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్ధతిని అవలంబిస్తూ బీసీలకు అన్యాయం చేయాలని చూస్తే సహించమన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ దృష్టిలో సామాజిక న్యాయం అంటే ఇతర పార్టీల నుంచి వచ్చిన రెడ్లకు పదవులు కాంట్రాక్టులు ఇవ్వడమేనా అని ప్రశ్నించారు. జితేందర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కూడా లేకుండానే కేబినెట్ హోదా కల్పించడం.. చిన్నారెడ్డి ప్రత్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేయలేనని చేతులెత్తేసినా ఆయనకు పదవి ఇవ్వడం, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్ బీసీ నాయకులు కష్టపడి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే వారికి కనీస మర్యాద ఇవ్వకపోవడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయమా అని నిలదీశారు. సమావేశంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్, జాంగ్ర సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, మేదరి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఆరెకటిక సంఘం జిల్లా నాయకుడు శ్రీనివాస్, బీసీ సమాజ్ కోకన్వీనర్ సత్యం, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ శేఖర్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యారావు